క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి



రాస్తారోకోలో మాట్లాడుతున్న రామిరెడ్డి, భాస్కర్

పామూరు: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘాతుకానికి బాధ్యులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, వివేకా విద్యాసంస్థల సీపీ కల్లూరి రామిరెడ్డి, కార్యదర్శి బండి భాస్కర్‌రావు అన్నారు. మహిళా జూనియర్ డాక్టర్‌పై ఘాతుకానికి బాధ్యులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం రాత్రి వివేకా విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివేకా పాఠశాల వద్ద నుంచి పామూరులోని ప్రధాన వీధుల్లో క్యాండిల్‌ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే దేశంలో రక్షణ కరువైందన్నారు. జూనియర్ డాక్టర్‌ను దుర్మార్గంగా హత్యచేసిన వారిని దోషులను శిక్షించకుండా వారికి మద్దతు తెలిపిన వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హెచ్‌ఎం బండి లక్ష్మీ కుమారి, ఒమీగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి మహాలక్ష్మయ్య, బ్రహ్మనందం, గద్దే ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ



ఈ క్రాప్ నమోదు పద్ధతిని వివరిస్తున్న విజయ్ కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని పెట్లూరు రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో కంది సాగు, ఈ క్రాప్ నమోదు వివరాలు వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో కంది పంట ఈ క్రాప్ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 8757 ఎకరాలు కాగా 1450 ఎకరాల్లో పంట వేసినట్లు గుర్తించామన్నారు. ఈ క్రాప్ వివరాలే ప్రభుత్వ సబ్సిడీలు, పరిహారం పొందేందుకు ప్రామాణికమని పేర్కొన్నారు. ప్రతి రైతు వీఏఏలను సంప్రదించి ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఐ.పద్మ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వయ్యారిభామ కలుపు నివారించాలి



వయ్యారిభామ కలుపు మొక్క గురించి తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు

గుడ్లూరు (కందుకూరు రూరల్): వయ్యారిభామ కలుపు మొక్కలను రైతులు నివారించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు సూచించారు. కేవీకే దత్తత గ్రామమైన మండలంలోని దారకానిపాడులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఈ కలుపు మొక్క నివారణకు పూతకు రాకముందే పీకి కుప్పగా వేసి తగులబెట్టాలని తెలిపారు. అలాగే దీని నివారణకు మెట్రిబూజిన్ లేదా 2, 4 డి సోడియం సాల్ట్, పారాక్వాట్ వంటి కలుపు మందులను పిచికారీ చేసి నివారించవచ్చన్నారు. బంజరు భూముల్లో సామూహికంగా అందరూ కలిసి మొక్కలను పీకి తగులబెట్టాలన్నారు. అలాగే రైతులు పండిస్తున్న వరి, పత్తి పంటలలో అవలంబిస్తున్న విధానాలు, లోపాలు, సమస్యలపై నిర్దిష్ట బృంద చర్చలు నిర్వహిస్తామన్నారు. వరిలో నేరుగా విత్తే సాలువరి పద్ధతిని పాటించడం ద్వారా నారు పెంచే అవసరం లేకుండా వరి పండించుకోవచ్చన్నారు. తద్వారా కూలీలు, నారు నాటే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి, నిహారిక, మాయాంక్, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు హరికృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రేవతి, రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అధ్యాపకులు

కందుకూరు రూరల్: టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థి కూచిపూడి గోపిచంద్ ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన అఖిల భారత ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ బీఎడ్ (ఆర్ట్స్) విభాగంలో ఆల్ ఇండియా 204వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరిలో 4వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. ఒక సామాన్య గ్రామీణ ప్రాంతం కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థి అఖిల భారత స్థాయిలో ఈ విధంగా రాణించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థికి వెయ్యి రూపాయిల నగదు పారితోషికాన్ని అందించారు. టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం అఖిలభారత స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పోటీ పరీక్షల్లో రాణించి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు.

ఆయాల ఆకలి కేకలు

- పాఠశాలల్లో ఆయాలకు నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ఎప్పుడిస్తారో.. స్పష్టత కరువు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పాఠశాలలో పనిచేస్తున్న ఆయా



ప్రభుత్వ పాఠశాల

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై చిన్న చూపు చూస్తోంది. పనిచేస్తేనే కుటుంబ పోషణ జరిగే చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుంది. ఒక్క నెల వేతనం ఆగితే ఆ కుటుంబాలు పడే అవస్థలు వర్ణనాతీతం. ఇక నాల్గు నెలలుగా జీతాలు రాకపోతే వారు ఎలాంటి దయనీయ పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారో.. అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తూ.. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుతున్న ఆయాలకు, పాఠశాలకు కాపలాగా ఉండే వాచ్‌మన్‌లకు వేతనాలు పడలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండు నెలలు దాటుతున్నా.. నేటికి వారి జీతాల పట్ల స్పష్టత కరువైంది. దీంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నట్లు ఆయాలు, వాచ్‌మెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత 445 పాఠశాలలుండగా వాటిలో సుమారు 25 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా దాదాపు 466 మంది ఆయాలు(స్వీపర్లు) పనిచేస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో ఆయాలు,(స్వీపర్లు), ఉన్నత పాఠశాలల్లో మాత్రమే వాచ్‌మన్లు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయాలను నియమించారు. రెండు పూటలా పాఠశాలలను, మరుగుదొడ్లను శుభ్రం చేయడం,

నియోజకవర్గంలో పాఠశాలలు: 445

విద్యార్థుల సంఖ్య: 25 వేల మంది

ఆయాల సంఖ్య: 466

మధ్యాహ్న భోజనం తర్వాత వ్యర్థాలాను, చెత్తా చెదారాన్ని తొలగించడం చేస్తారు. అనంతరం పచ్చదనం పెంపొందించే ప్రక్రియలో భాగంగా మొక్కలకు నీరు పోసి.. వాటి సంరక్షణ చర్యలు చేపడతారు. దీనికి గాను పాఠశాలలో 300 మంది విద్యార్థులుంటే ఒక ఆయా, 600 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఆయాలు, 600 నుంచి 900 మంది విద్యార్థులుంటే ముగ్గురు ఆయాలు, 900 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు నల్గురు ఆయాలను నియమించారు.

గత ప్రభుత్వంలో ఠంచన్‌గా వేతనం

పాఠశాలతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు నియమించిన ఆయాలకు ప్రభుత్వం నెలకు రూ.6 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు జమ అయ్యేవి. ఇందులో స్కూల్ మెయింట్ నెన్స్ ఫండ్ కింద రూ.2 వేలను వినియోగించే వారు. ఆడబ్బుల్లోనే ఆయాలకు వేతనాలతో పాటు మరుగుదొడ్ల పరిశుభ్రతకు ఉపయోగించే వస్తువులు, ద్రావణాలు ఖర్చు చేసే వారు. గత ప్రభుత్వంలో ఆయాలకు ప్రతి నెల ఠంచన్‌గా అందచేసే వారు. ఈ ఏడాది మార్చి తర్వాత ఆయాలకు వేతనాలు అందలేదు. దీంతో గగ్గోలు పెడుతున్నారు.

జీతాలు తక్షణం అందజేయాలి



ప్రభుత్వ బడుల్లో పొట్టకూటి కోసం పనిచేస్తున్న ఆయాలకు నైట్ వాచ్‌మెన్‌లకు జీతాలు నాల్గు నెలల నుంచి ఇవ్వ లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నెల నెలా ఠంఛన్‌గా వేతనాలు వేశారు. కొత్త ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో చిరు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు రాక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

జీపీ రామారావు, ప్రభుత్వ పాఠశాలల ఆయా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు

విద్యా శాఖాధికారులు స్పందించాలి:



ఆయాలు, స్వీపర్లు, నైట్ వాచ్‌మెన్‌లకు జీతాల సమస్యను విద్యాశాఖ అధికారులు తక్షణం పరిష్కరించాలి. కూటమి ప్రభుత్వం తక్షణ సమస్య పరిష్కారంకు దృష్టి పెట్టాలి. జీతాలు రాక పోవడంతో అనేక మంది వడ్డీలకు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలు గతంలో లేవు.

పవన్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు)

కుటుంబ పోషణ భారంగా ఉంది:

నాలుగు నెలలుగా జీతాలు లేవు. కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా ఉంది. వేతనాలు చెల్లిస్తే.. మాకు ఇబ్బందులు తప్పుతాయి. ఏప్రిల్ నెల నుంచి జీతాలు రాలేదు. ప్రభుత్వం, అధికారులు దీనిపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలి.

ఎం కుమారి, హైస్కూల్ ఆయా, కనిగిరి

జీతాల పైనే అధారపడి బతికే వాళ్లం:

మాకు రావాల్సిన జీతాలు చెల్లించక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వాటి పైనే అధార పడి జీవిస్తున్నాం. పాఠశాల ఉదయం నుంచి సాయంత్రం దాక ఉంటుంది. వేరే పనికి పోయేందుకు వీలు ఉండదు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

ఎస్ లక్ష్మీ, ఆయాకనిగిరి

కనిగిరి నియోజకవర్గంలోని పాఠశాలల వివరాలు:

మండలం	ప్రభుత్వ పాఠశాలల సంఖ్య	పాఠశాలల్లో ఆయా, స్వీపర్లు
కనిగిరి	107	116
హెచ్‌ఎం పాడు	65	65
పీసీపల్లి	56	60
సీఎస్‌పురం	64	69
పామూరు	87	90
వెలిగండ్ల	66	66
మొత్తం	445	466

కలెక్టర్‌కు సమస్యల మొర

- బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని చైర్మన్ గఫార్ వినతి
- పొలాలకు దారి లేకుండా రైల్వే లైన్ వేస్తున్నారని రైతుల వేడుకోలు



కలెక్టర్‌కు సమస్యలు విన్నమిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పరిశీలన నిమిత్తం కనిగిరి ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారీయాను పలువురు సమస్యలు విన్నవించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలని చైర్మన్ గఫార్ వినతి కనిగిరి పట్టణంలో దశాబ్దకాలం నుంచి అసంపూర్తిగా ఆగి పోయి ఉన్న నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ కలెక్టర్‌కు విన్నవించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని వెల్లడించారు. దీంతో స్పందించిన కలెక్టర్‌తగుచర్యలుతీసుకుంటామనితెలిపారు.

పొలాలకు దారి లేకుండా రైల్వేలైన్ వేస్తున్నారు..

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం గ్రామం ఏరియాలో శంఖవరం, చింతలపాలెం, హరిజనపాలెం, పునుగోడు గ్రామలకు చెందిన 23 మంది రైతులకు సంబంధించి దాదాపు 300 ఎకరాలు సాగు భూమి ఉంది. అయితే ఆభూముల్లో సాగు పొలాలకు వెళ్లే దారి లేకుండా రైల్వే అధికారులు నడికుడి కాళహస్తి రైలు మార్గం రైల్వే లైన్ వేస్తున్నారు. ఆ సాగు పొలాలకు సంబంధించిన రెండు ప్లాన్ రహదారులున్నా.. రైల్వే లైన్ వారు వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారని, దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పొలాలకు వెళ్లే దారి లేకుంటే పంటలు సాగుకు మేము ఎలా చేయాలని, పొలాలు బీళ్లుగా మారితే తాము ఎలా జీవించాలని కలెక్టర్ వద్ద వాపోయారు. దీంతో స్పందించిన కలెక్టర్ తాను త్వరలో కనిగిరికి వచ్చి రైలు మార్గ వెళ్లే భూములను పరిశీలిస్తానని.. రెండ్రోజుల్లో దాన్ని పరిశీలించి నివేదికలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిస్తానని తెలిపారు.

అలాగే పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో గల 2.60 సెంట్ల భూమిని తమకు అమ్మి తిరిగి ఫ్రీ హోల్డ్‌లో వారే రికార్డులో ఎక్కించుకుని తమకు అన్యాయం చేశారని జె.నాగమణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. అనేక మంది పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నమించారు. తొలుత చైర్మన్ అబ్దుల్ గఫార్ కలెక్టర్, సీసీఎల్ఎకు పూల మొక్కలను అందచేశారు. కార్యక్రమంలో జేసీ గోపాల కృష్ణ, ఆర్డీఓ పి.జాన్ ఇర్వీన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


‘మధుమేహం జబ్బు కాదు’



పుస్తకావిష్కరణలో పాల్గొన్న డాక్టర్లు కృష్ణ మోహన్, సుధాకర్, హర్షిత, శ్రీవాణి, గ్రామ పెద్దలు

కొండపి(సింగరాయకొండ): ప్రముఖ సుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ కంకణాల కృష్ణ మోహన్ రచించిన ×మధుమేహం జబ్బు కాదు¥ అనే ఆరోగ్య విద్యా పుస్తకాన్ని ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సభ్యుడు, ఒంగోలు మేఘ ఆసుపత్రి వైద్యుడు కొర్రపాటి సుధాకర్ ఆవిష్కరించారు. మంగళవారం కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో స్థానిక మన ఊరి ఆరోగ్య వికాసం సంస్థ నిర్వహించిన పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ కృష్ణ మోహన్ రచించిన మధుమేహం జబ్బు కాదు అనే పుస్తకం అందరూ చదివి, ఆచరిస్తే మధుమేహాన్ని నియంత్రించవచ్చన్నారు. ప్రజలు కొద్ది దూరానికి కూడా మోటారు సైకిల్ వాడుతున్నారని, నడవడం, సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిదన్నారు. భూమికి హానిచేసే ప్లాస్టిక్ సంచులు వాడద్దనీ పిలుపునిచ్చారు. పి.జి.ఎన్.ఎఫ్ సంస్థ తరపున గ్రామ ప్రజలకు జూట్ సంచులను బహుమతిగా ఇచ్చారు. ఎన్ఆర్ఐ డాక్టర్ గుంటుపల్లి మదన్ మోహన్ మాట్లాడుతూ.. డాక్టర్ కృష్ణ మోహన్ గ్రామీణ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారంటూ కృతజ్ఞతలు తెలిపారు. మన ఊరి వికాసం సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పుస్తక రచయిత డాక్టర్ కృష్ణ మోహన్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ హర్షిత, ఎన్ఆర్ఐ డాక్టర్ మదన్ మోహన్‌ను ఘనంగా సన్మానించారు. వైద్య శిబిరంలో 63 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల చెంచురామయ్య, రావెళ్ల వెంకట ప్రసాద్, వీరమోసు మస్తానరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మన ఊరి ఆరోగ్య వికాసం కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాలికుంటు రాకుండా టీకాలు వేయించండి



టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, వైద్యులు

లింగసముద్రం: పశువులకు గాలికుంటు రాకుండా ఉండేందుకు టీకాలు వేయించుకోవాలని వీఆర్ కోట పశు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. వీఆర్ కోటలో గాలికుంటు వ్యాధి రాకుండా మంగళవారం టీకాలు వేశారు. ఈ నెల 20 నుంచి 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా వేస్తామని చెప్పారు. ఎల్ఎస్ఏ మహేంద్ర, పశు సంవర్ధక సహాయకులు జె.ప్రవీణ్, చౌడయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని కోవూరు పశువైద్యశాలలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ ఆవుల మాధవరావు మంగళవారం ప్రారంభించారు. పశువైద్యులు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ ఇది అంటు వ్యాధి, గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. నాదెళ్ల రమణయ్య, జిల్లెళ్లమూడి రవికుమార్, కోవూరు, గోపాల్‌క్రిష్ణమూర్తి, పశువైద్య కేంద్ర సహాయకులు జి.విజయ్ సాగర్, రైతు సేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కుసహకరించండి

కందుకూరు రూరల్: ఈ నెల 21వ తేదీన జరిగే భారత్ బంద్‌కు సహకరించాలని మాలమహాసభ, మాల యువసేన, మాల మహానాడు, మాల సంఘాల (జేఏసీ) మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. కందుకూరు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు, హోటల్స్, వివిధ వ్యాపార సంస్థలు, టీ స్టాల్స్, ప్రభుత్వ సంస్థలు, ఆర్‌టీసీ, ఆటో, కార్ ట్రావెల్ యూనియన్, లారీ అసోసియేషన్ ఈ భారత్ బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ బంద్ రిజర్వేషన్లు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ జరుగుతందన్నారు.

పేకాట శిబిరాలు నిర్వహిస్తే రౌడీషీట్



కొండపి సీఐ సోమశేఖర్

కొండపి(సింగరాయకొండ): పేకాట శిబిరాలు నిర్వహించే వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని కొండపి సీఐ సోమశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపి టౌన్లో ట్రాఫిక్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈవ్ టీజర్లపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపుతామన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించడంతోపాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుడి చేయూత



విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రమణయ్య

మర్రిపూడి: తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు రిటైర్డ్ బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పూజల రమణయ్య రూ.5 వేలు సాయం చేయడం ఎంతో సంతోషకరమని హెచ్‌ఎం తూగుట్ల బిక్షాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున 10 మందికి సహాయం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. దాత రమణయ్యను మిగిలిన ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు సహాయపడాలని కోరారు. ఉపాధ్యాయులు శ్రీరాం మురళి, ఆదినారాయణ, అమరేశ్వరి పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

కనిగిరి రూరల్: చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.4 లక్షల పరిహారం విధిస్తూ మంగళవారం కనిగిరి జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయ మూర్తి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..సీతారంపురంకు చెందిన ఎస్ వెంకటయ్య.. కనిగిరికి చెందిన దాసరి రాఘవయ్య దగ్గర రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. అందుకు సంబంధించి రూ.4లక్షల చెక్కును రాఘవయ్యకు ఇచ్చాడు. అయితే ఆ చెక్కును రాఘవయ్య బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. దీనికి సంబంధించిన కేసు ఆరేళ్ల విచారణ జరిగి మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు నిందితుడు వెంకటయ్యకు ఏడాది జైలుశిక్ష, రూ.4 లక్షల పరిహారం విధిస్తూ కనిగిరి జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయ మూర్తి కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చారు.

22 నుంచి డిగ్రీ రెండో దశ ఆన్‌లైన్ ప్రవేశాలు

కందుకూరు రూరల్: ఏపీ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ నుంచి డిగ్రీ రెండో దశ ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని టీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. కళాశాలలో చేరాలనుకున్న విద్యార్థులు ఈ నెల 22 నుంచి 24 వరకు రిజిస్ట్రేషన్, 23 నుంచి 25వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఓపెన్ అవుతాయన్నారు. 29న రెండవ దశ సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 3లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీలో చేరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ప్రవేశం పొందే పేద విద్యార్థులు వారి చదువుకు ఆటంకం లేకుండా కొనసాగించేందుకుఫీజులో రూ.2 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రాయితీ నగదును కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్, సిబ్బంది భరిస్తారని చెప్పారు.

913 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం 913 బేళ్లు కొనుగోలయ్యాయి. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, పాలేటిపాడు గ్రామాల రైతులు 994 బేళ్లను వేలానికి తీసుకురాగా 81 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.313.96 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి

కొండపి(సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన వేలంలో నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1260 బేళ్లను ఉంచగా 1083 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 177 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.358, కనిష్ఠ ధర రూ.204, సరాసరి ధర రూ.296.26 పలికింది. వేలంలో 15 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న శేషమ్మ, పక్కన ఏఓ విజయ్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని వెన్నూరు, కె.ఉప్పలపాడు రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వీవీ శేషమ్మ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు విచక్షణారహితంగా వాడటం వల్ల సాగు ఖర్చులు పెరిగి, రైతులకు నికర ఆదాయం తగ్గిపోతోందన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశినులు, వేప కషాయం లేదా వేప నూనె లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎ.శైలజరాణి మాట్లాడుతూ.. మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలుగులో ప్రచురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీ ఎస్తేరురాణి, ఏఓ డి.విజయ కుమార్, వీఏఏలు జె.కొండలరావు, డి.జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పీసీపల్లి: ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభల్లో ఉపాధి పనికి నియమ నిబంధనలు వివరించడం, ఈ ఆర్థిక సంవత్సంలో చేపట్టే పనుల పురోగతి, రానున్న రోజుల్లో చేపట్టనున్న పనులపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పామూరు: ఉపాధి పనులు గుర్తించేందుకు ఈ నెల 23న మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బొల్లినేని సురేష్ తెలిపారు. గ్రామ సభల్లో నూతన పనుల గుర్తింపుకు పలు సూచనలు చేయాలని ఎంపీడీఓ కోరారు.

జాబ్‌కార్డుదారులకు పని కల్పించాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 23న ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ జలజాక్షి అధికారులకు సూచించారు. జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఉపాధి హామీ పథకంపై మండల, గ్రామ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జాబ్ కార్డుదారులకు 100 రోజుల పని కల్పించాలని సూచించారు. ఈఓఆర్డీ అంజనీదేవి, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

23న గ్రామసభలు

సీఎస్‌పురం(పామూరు):ఉపాధిపనులుగుర్తించేందుకు మండలంలోని పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల్లోనూతనపనులుగుర్తించేందుకుప్రజలు, కూలీలు పలు సూచనలు చేయాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

23న ఉపాధి హామీ గ్రామ సభలు

సింగరాయకొండ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఈనెల 23వ తేదీన ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించి ఆమోదయోగ్యమైన పనులు గుర్తించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మూర్తి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ప్రతి గ్రామసభకు కూలీలు, అధికారులు హాజరు కావాలని, నిధులు సద్వినియోగమయ్యే పనులు చేపట్టాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు (కందుకూరు రూరల్): మండలంలో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు ట్రాక్టర్ డ్రైవర్లను, యాజమానులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన ట్రాక్టర్లను మొదటిసారి అయితే రూ.10 వేల జరిమానా, ఇది వరకే కేసు నమోదైతే రూ.20వేలు చలానా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలా పట్టుబడిన ట్రాక్టర్ మీద రెండు కన్న ఎక్కువ కేసులు ఉంటే వాటికి జరిమానాతో పాటు సదరు ట్రాక్టర్‌ను కోర్టుకి పెడతామని పోలీసులు తెలిపారు

పోలేరమ్మ గుడిలో చోరీ

కందుకూరు రూరల్: పోలేరమ్మ తల్లి గుడిలో చోరీ జరిగింది. ఈ సంఘటన మండలంలోని మోపాడు గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని పోలేరమ్మతల్లి గుడిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి గుడిలోకి వెళ్లి 35 గ్రాముల అమ్మవారి బంగారం, హుండీ పగలగొట్టి నగదును దుండగులు చోరీ చేశారు.